క్లుప్తంగా

నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సుప్రజ

బుచ్చిరెడ్డిపాళెం: పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ హెచ్చరించారు. ఆమె తన కార్యాలయంలో పారిశుద్ధ్య సిబ్బంది పనితీరుపై గురువారం సమీక్ష నిర్వహించారు. విధి నిర్వహణలో అలక్ష్యంగా ఉండొద్దని, ఎక్కడా పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పంచాయతీలు ఆదాయం సమకూర్చుకోవాలి



ఎరువును రైతుకు అందజేస్తున్న డీఎల్‌పీఓ

మనుబోలు: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో ఎరువు తయారు చేసి రైతులకు విక్రయించడం ద్వారా పంచాయతీలు ఆదాయం సమకూర్చుకోవాలని డీఎల్‌పీఓ పుట్టా రమణయ్య అన్నారు. మనుబోలు పంచాయతీ పరిధిలోని కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. అక్కడ తయారైన ఎరువును రైతులకు విక్రయించారు. నగదును పంచాయతీకి జమ చేయాలని కార్యదర్శి గరుడయ్యకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పంచాయతీలు సొంతంగా ఆదాయ మార్గాలను అన్వేషించాలన్నారు. ఇళ్ల నుంచి పంచాయతీ సిబ్బంది సేకరించిన చెత్తను తడి, పొడిచెత్తగా విభజించి షెడ్లకు తరలించాలన్నారు.

ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తే చర్యలు

- కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి



బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ పరిధిలో ముంబై హైవే డివైడర్‌పై ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ కె.చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. బుచ్చిరెడ్డిపాళెంలోని ఆయన కార్యాలయంలో గురువారం మాట్లాడారు. డివైడర్‌పై ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. వ్యాపారులు, రాజకీయ నాయకులు నిబంధనలు పాటించాలని కోరారు.

జిల్లాలో యూరియా కొరత లేదు

- డీఏఓ సత్యవాణి



మాట్లాడుతున్న డీఏఓ సత్యవాణి

కోవూరు: జిల్లాలో యూరియా కొరత లేదని, ఈ విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయాధికారి(డీఏఓ) పి.సత్యవాణి తెలిపారు. కోవూరు మండలం పడుగుపాడు రైల్వే యార్డులో యూరియా లోడింగ్ జరిగే ప్రాంతాన్ని గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాకు ఈనెలలో 25 వేల మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉందని, ప్రస్తుతం 12 వేల మెట్రిక్ టన్నులు వచ్చినట్లు తెలిపారు. మిగిలిన 18 వేల టన్నుల యూరియా ఈ నెలాఖరులోగా వస్తుందన్నారు. యూరియా దొరకదని రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆమె వెంట జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకుడు నర్సోజీ, కోవూరు వ్యవసాయ సహాయ సంచాలకులు సుజాత, ఏఓ ఇందిరావతి తదితరులు ఉన్నారు.

దివ్యాంగులకు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న సోమిరెడ్డి

వెంకటాచలం: మండలంలోని ఎర్రగుంట వద్దనున్న దివ్యాంగుల ప్రాంతీయ సంయుక్త కేంద్రం (సీఆర్సీ)లో దివ్యాంగులకు గురువారం పారాలింపిక్ స్పోర్ట్స్ ఈవెంట్‌ను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రారంభించారు. సీఆర్సీ డైరెక్టర్ మనోజ్‌కుమార్ మాట్లాడుతూ దివ్యాంగులకు మూడు కేటగిరీల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు జనవరి మూడో తేదీన బహుమతులను ప్రదానం చేస్తామని తెలియజేశారు.

వారిదే హవా..

- మత్స్య కళాశాలలో విద్యార్థినులే అధికం
- మత్స్య శాస్త్రంపై ఆసక్తి
- ప్రతి తరగతిలో వారిదే పైచేయి

తరగతి	యువకులు	యువతులు
బీఎఫ్‌ఎస్సీ 1 సం.	16	27
బీఎఫ్‌ఎస్సీ 2 సం.	10	31
బీఎఫ్‌ఎస్సీ 3 సం.	15	22
బీఎఫ్‌ఎస్సీ 4 సం.	12	20
ఎంఎఫ్‌ఎస్సీ 1 సం.	8	10
ఎంఎఫ్‌ఎస్సీ 2 సం.	4	5
పీహెచ్‌డీ 1 సం.	2	1
పీహెచ్‌డీ 2 సం.	1	1
పీహెచ్‌డీ 3 సం.	3	--



బీఎఫ్‌ఎస్సీ తరగతి గదిలో విద్యార్థులు

ముత్తుకూరు: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రప్రథమంగా ముత్తుకూరులో ఏర్పాటైన మత్స్య కళాశాలలో మత్స్య శాస్త్రం అభ్యసించేందుకు యువతులు అధికంగా ఉత్సాహం చూపుతున్నారు. ప్రస్తుతం యువకులు 71 మంది ఉండగా యువతులు 117 మంది ఉన్నారు. దీనిని బట్టి భవిష్యత్‌లో మహిళా శాస్త్రవేత్తలే హవా కొనసాగించనున్నట్లు తెలుస్తోంది. అన్ని తరగతుల్లో వీరి సంఖ్యే అధికంగా ఉంది. ఉద్యోగ, ఉపాధి రంగాల్లో అవకాశాలు మెరుగుపడటం, మత్స్య శాస్త్రంపై అభిరుచి ఏర్పడటంతో బాలికలు ఆకర్షితులవుతున్నారు.

ఏర్పాటు ఇలా..

బోధన, పరిశోధన, విస్తరణ ప్రధాన సూత్రాలతో తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో 1992లో మత్స్య కళాశాల ఏర్పాటైంది. తొలుత ఐదు సీట్లతో 'మొదటి సంవత్సరం బీఎఫ్‌ఎస్సీ (బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్)' తరగతులు ప్రారంభమయ్యాయి. ఇప్పుడు 43 సీట్లతో (కొత్త బ్యాచ్) మొదటి సంవత్సరం తరగతులు నవంబరు 20వ తేదీన మొదలయ్యాయి. శ్రీవెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ పరిధిలో పనిచేసిన ఈ కళాశాల సరిగ్గా 30 ఏళ్ల తర్వాత గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటీ' పరిధిలోకి వెళ్లింది. 2022 జనవరి 1వ తేదీన ఈ ప్రక్రియ జరిగింది.

62 కోర్సుల్లో..

వెటర్నరీ, డెయిరీ, అగ్రికల్చర్, హార్టీ కల్చర్ కళాశాలలతో పోలిస్తే ముత్తుకూరు మత్స్య కళాశాలలో యువతుల సంఖ్య అధికం. నాలుగు సంవత్సరాల బీఎఫ్‌ఎస్సీ తరగతుల్లో మొత్తం 62 కోర్సుల్లో ఇక్కడ బోధన నిర్వహిస్తారు. ముఖ్యంగా మొదటి సంవత్సరం విద్యార్థులకు తప్పనిసరిగా స్విమ్మింగ్ తరగతులుంటాయి. ప్రతి ఒక్కరూ ఈత నేర్చుకునేందుకు ఇక్కడ స్విమ్మింగ్‌పూల్ కూడా ఉంది.

ఉద్యోగావకాశాలు మెండు



ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉండటంతో బాలుర కంటే బాలికలు అధికంగా మత్స్య కళాశాలలో చేరుతున్నారు. హేచరీలు, ఫీడ్ సంస్థలు, ఫార్మింగ్, ప్రాసెసింగ్, మార్కెటింగ్ విభాగాల్లో అవకాశాలే కాకుండా ప్రభుత్వ రంగంలో ఎఫ్‌డీఓ పోస్టులకు కూడా బీఎఫ్‌ఎస్సీ విద్యార్థుల అవసరం ఉంది.

– డాక్టర్ బాలసుబ్రమణియన్, అసోసియేట్ డీన్, మత్స్య కళాశాల



ముత్తుకూరులోని మత్స్య కళాశాల

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

వెంకటాచలం: మండలంలోని చెముడుగుంట వద్దనున్న మద్యం దుకాణంలో చోరీ కేసులో నిందితుడిని గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి కథనం మేరకు.. సెప్టెంబర్ 6వ తేదీన ప్రభుత్వ మద్యం దుకాణంలో నగదు చోరీపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడైన నెల్లూరు నగరం వనంతోపు సెంటర్ ప్రాంతానికి చెందిన కంచు విష్ణును అరెస్ట్ చేసి రూ.40 వేలు రికవరీ చేశారు.

బస్సు ప్రారంభంపై హర్షం

తోటపల్లిగూడూరు: మండలంలోని చిన్నచెరుకూరు గ్రామస్తుల కల నెరవేరింది. గతంలో చిన్నచెరుకూరు – నెల్లూరు ఎన్జీఓ కాలనీ మధ్య ఆర్టీసీ బస్సు తిరుగుతుండేది. తర్వాత కాలంలో అధికారులు గ్రామానికి బస్సు సౌకర్యాన్ని అధికారులు నిలిపివేశారు. గ్రామ వాసి అయిన ఏపీఎస్ఆర్టీసీ నెల్లూరు రీజియన్ చైర్మన్‌గా సన్నపురెడ్డి సురేష్‌రెడ్డికి స్థానికులు విన్నవించడంతో గురువారం నరుకూరు – చిన్నచెరుకూరు మధ్య బస్సును ప్రారంభించారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు



ముత్తుకూరు: మాట్లాడుతున్న డీటీ ప్రదీప్



మనుబోలులో..



కొడవలూరు: మాట్లాడుతున్న తహసీల్దార్ స్ఫూర్తి

ముత్తుకూరు: మండలంలోని ఆముదాలపాడులో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో అధికారులకు స్థానికుల నుంచి ఆరు అర్జీలు మాత్రమే అందాయి. డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్, రీ సర్వే డీటీ శ్రీనివాసులు, సర్పంచ్ మునుకూరు జనార్దనరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సదస్సుపై రైతులు ఆసక్తి చూపలేదు.

రెండు గ్రామాల్లో..

మనుబోలు: మండలంలోని జట్ల కొండూరు, కుడితిపల్లి గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీటీ మంజుల మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమాల్లో సర్వేయర్ శ్రీనివాసరావు, వీఆర్వో సురందర్‌రెడ్డి, నీటి సంఘం ఉపాధ్యక్షుడు వెందోటి భాస్కర్‌రెడ్డి, ఉప సర్పంచ్ ఆవుల తులసీరాం తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

కొడవలూరు: రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కె.స్ఫూర్తి కోరారు. మండలంలోని బసవాయపాళెం, గుండాలమ్మపాళెంలలో గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సదస్సుల్లో కేవలం రెవెన్యూ సమస్యలే కాకుండా అన్ని శాఖల సమస్యలపై వినతులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీలత, సర్పంచ్ కె.దివ్య, వీఆర్వో బాబు, విలేజ్ సర్వేయర్ శివ, స్థానిక నాయకుడు అమరేంద్రరెడ్డి పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు



ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

తోటపల్లిగూడూరు: 'ఎరువుల కొరత లేకుండా అన్ని రకాలను పూర్తిస్థాయిలో రైతులకు అందుబాటులో ఉంచాం. వాటిని డీలర్లు ఎమ్మార్పీకే విక్రయించాలి' అని మండల వ్యవసాయాధికారిణి శిరీషారాణి తెలిపారు. ముత్తుకూరు మండల వ్యవసాయాధికారిణి జోత్స్న రాణితో కలిసి ఆమె గురువారం మండలంలోని పలు ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేపట్టి డీలర్ల లైసెన్స్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల పాస్‌పుస్తకంలో ఉన్న విస్తీర్ణాన్ని బట్టి బయోమెట్రిక్ ఆధారంగా ఎరువులను సరఫరా చేయాలన్నారు. కృత్రిమ కొరత సృష్టిస్తే సంబంధిత డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎరువుల విషయంలో సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

పేదలకు ఉచిత న్యాయ సహాయం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వాణి

కొడవలూరు: ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వారికి, నిరక్షరాస్యులు, అంగవైకల్యం కలిగిన వ్యక్తులకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామని సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి తెలిపారు. మండలంలోని నార్తురాజుపాళెం ఆంజనేయ సీఫుడ్స్‌లో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏపీ సంక్షేమ నిధి చట్టం-1987ను రూపొందించి అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో కార్మిక శాఖ అసిస్టెంట్ డిప్యూటీ కమిషనర్ గౌస్‌బాషా, పారా లీగల్ వలంటీర్ వెంకటేష్, ఆంజనేయ సీ ఫుడ్స్ ప్రతినిధులు ఏవీ ప్రసాద్, శ్యామ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు



ఆలయంలో పూజలు



భిక్షాటన చేస్తున్న భక్తులు

పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం ధనుర్మాస పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలను ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

➡ ధనుర్మాసం సందర్భంగా శనివారం శివాలయం వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని గోవింద మాలధారణ భక్తులు గురువారం వెల్లడించారు. స్వామి, అమ్మవార్ల ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించేందుకు వారు గ్రామంలో భిక్షాటన చేశారు.

ఎమ్మెల్సీ పర్వతరెడ్డికి కాకాణి పరామర్శ



ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డితో మాట్లాడుతున్న గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు: మండలంలోని పోలంరాజుగుంట గ్రామంలో గురువారం మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని ఆయన పరామర్శించారు. ఎమ్మెల్సీ అత్త దువ్వూరు లీలావతమ్మ మృతిచెందగా ఉత్తరక్రియలకు కాకాణి హాజరయ్యారు. పొట్టెంపాడులో పర్యటించి పలువురు కార్యకర్తలను పరామర్శించారు.

➡ **మనుబోలు:** మండల కేంద్రమైన మనుబోలుకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పల్లంరెడ్డి బాలకృష్ణారెడ్డి సతీమణి అరుణమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. గురువారం మనుబోలులో జరిగిన ఉత్తరక్రియలకు మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి హాజరై నివాళులర్పించారు. అనంతరం బాలకృష్ణారెడ్డి, ఆయన కుమారుడు హరహరరెడ్డి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాకాణి వెంట నాయకులు ఏడెం మల్లికార్జునరెడ్డి, బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, బొమ్మిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, ముంగర రవీందర్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, ఆవుల తులసీరామ్, పార్థు తదితరులున్నారు.



అరుణమ్మకు నివాళులర్పిస్తున్న కాకాణి

వీఎస్‌యూలో స్టూడెంట్స్ హ్యాండ్‌బుక్ ఆవిష్కరణ



హ్యాండ్‌బుక్‌ను ప్రదర్శిస్తున్న ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు తదితరులు

వెంకటాచలం: విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)కు సంబంధించిన పూర్తి సమాచారంతో హ్యాండ్‌బుక్‌ను రూపొందించారు. దీనిని మండలంలోని కాకుటూరులో ఉన్న వర్సిటీలో గురువారం ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పుస్తకం విద్యార్థులకు మార్గదర్శకంగా ఉంటుందని తెలియజేశారు. వర్సిటీలో అందుబాటులో ఉన్న విద్యా కార్యక్రమాలు, వనరులు, సదుపాయాలు, అవకాశాలను ఒకేచోట పొందుపరిచినట్లు వెల్లడించారు. పుస్తక రూపకల్పనలో భాగమైన బృందాన్ని అభినందించారు. భవిష్యత్‌లో మరింత ఉపయోగకరమైన సమాచారాన్ని అందించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ సీహెచ్ విజయ, పరీక్షల నియంత్రణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఏడుగురు విద్యార్థుల డిబార్

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో గురువారం నిర్వహించిన డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షల్లో ఏడుగురు విద్యార్థులను డిబార్ చేసినట్లు వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. 8,491 మందికి గానూ 7,757 మంది హాజరయ్యారని, 734 మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు.

సోలార్ ట్రాప్స్‌తో పురుగుల నియంత్రణ



రైతులకు సూచనలిస్తున్న ఆత్మ పీడీ శివన్నారాయణ

- ఆత్మ పీడీ శివన్నారాయణ

కొడవలూరు: వరి పొలంలో సోలార్ ట్రాప్స్‌ను ఏర్పాటు చేయడం వల్ల పురుగులను ముందుగానే గుర్తించి అవసరమైన మందులను వేసుకోవచ్చని ఆత్మ పీడీ శివన్నారాయణ తెలిపారు. మండలంలోని నార్తురాజుపాళెం, రామన్నపాళెంలలో గురువారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ఆయన హాజరై, స్థానిక పొలాల్లో లింగాకర్షక బుట్టలు, సోలార్ ట్రాప్స్‌ను ఏర్పాటు చేశారు. అదేవిధంగా రామన్నపాళెంలో వరిలో జింకు లోపం అధికంగా ఉన్నందున జింక్ సల్ఫేట్ రెండు గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త విజయకుమార్ ఎలుకల నివారణ కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు.

అనంతరం రైతులకు ఎలుకల మందు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోవూరు ఏడీఏ డి.సుజాత, ఏఓ సీహెచ్ఎస్.లక్ష్మి, వీఏఏలు ఆర్.నిహారిక, ఎ.శివజ్ఞాన పాల్గొన్నారు.

చినుకు పడితే అడుగు మోపలేం

- నెలరోజులైనా తొలగని వర్షపునీరు
- సమాఖ్య కార్యాలయ దుస్థితి

కొడవలూరు: చినుకు పడితే నెల రోజులైనా కార్యాలయానికి అడుగు మోపలేని పరిస్థితి నెలకొంటోంది. ఈ పరిస్థితి ఎక్కడో కాదు.. మండల కేంద్రమైన కొడవలూరులోనిది. స్థానిక సంఘమిత్ర మండల సమాఖ్య కార్యాలయం కొడవలూరు మెయిన్ రోడ్డుకు బాగా పల్లంలో నిర్మించి ఉన్నారు. దీనివల్ల వర్షం పడితే ప్రాంగణమంతా వర్షపు నీరు నిలుస్తున్నాయి. ఈ నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో నెల రోజులకు కూడా తగ్గడం లేదు. బురదమయంగా మారి కార్యాలయానికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ సమాఖ్య పరిధిలో 900లకు పైగా పొదుపు సంఘాలున్నాయి. దీంతో కార్యాలయానికి వివిధ అవసరాలపై వచ్చే మహిళలు ఎక్కువగా ఉంటారు. ఈ పరిస్థితుల్లో బురద, వర్షపు నీటిలో నడుచుకుంటూ వెళ్లలేక నానా తంటాలు పడుతున్నారు. ఉద్యోగులు సైతం కార్యాలయానికి వెళ్లలేక పక్కనే ఉన్న ఎంపీడీఓ కార్యాలయంలో ఉండి విధులు నిర్వహించాల్సి వస్తోంది. ఈ సమస్య ఎన్నో ఏళ్లుగా వెంటాడుతోంది. దీనిని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయినా ఫలితం ఉండడం లేదు. ప్రజాప్రతినిధులైనా పట్టించుకుని కార్యాలయం ముందు భాగంలో మట్టి తోలి ఎత్తు పెంచితే సమస్య పరిష్కారమవుతుంది.



సమాఖ్య కార్యాలయ ప్రాంగణంలో వర్షపునీరు

అధ్వానంగా..

కోవూరు: మండలంలోని పాటూరు గ్రామంలో యల్లాయపాళెం రోడ్డు అధ్వానంగా తయారైంది. ఇక్కడి రోడ్డులో పెద్దపెద్ద గుంతలు ఏర్పడటంతో చిన్నపాటి వర్షం కురిసినా నీరు నిలిచి ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. వాహనదారులకు ఎక్కడ గుంతలు ఉందో తెలియక ప్రమాదకరంగా ప్రయాణాలు చేస్తున్నారు. కూటమి నేతలు రోడ్లు వేస్తున్నామని చెబుతున్నారే తప్ప ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు.



పాటూరు- యల్లాయపాళెం రోడ్డు దుస్థితి